

ఇందిరాపార్కు, దోమలగూడ ఎల్‌బిసి వద్ద ఉన్న వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మాజీ కార్పొరేటర్ రవీందర్, బీజేపీ నేతలు, బస్తీ వాసులు

జలమండలి అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కవాడిగూడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ దోమలగూడ తాళ్లబస్తీలో నూతనంగా ఏర్పాటుచేసిన డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పేరుతో ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వివదిలేయడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని దోమలగూడ డివిజన్‌మాజీ కార్పొరేటర్ రవీందర్ అధికారులను డిమాండ్ చేశారు. తవ్వివదిలేసిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్‌చేస్తూ కవాడిగూడ డివిజన్ బీజేపీ, దోమలగూడతాళ్లబస్తీ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ఎల్‌బిసి వద్ద దోమలగూడ వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట బీజేపీ నేతలు, తాళ్లబస్తీ కమిటి నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ రవీందర్ మాట్లాడుతూ.. జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా రోడ్ల తవ్వడంతో పాటు డ్రైనేజీ పైప్‌లైన్ ప్రతి ఇంటికి కలపడానికి డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ స్థానికుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేశారని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో బస్తీలో ఇంటింటికి వెళ్లి విచారణచేసి స్థానిక ప్రజలకు న్యాయం చేసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇవ్వడంతో బీజేపీ నేతలు, బస్తీ కమిటి నాయకులు ధర్నా విరమించారు. ఈ ధర్నాలో బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్ష కార్యదర్శులు, దోమలగూడ తాళ్లబస్తీ కమిటి అధ్యక్ష కార్యదర్శులు, బస్తీవాసులు పాల్గొన్నారు.



నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

నాలా పనులను పరిశీలించిన కార్పొరేటర్

నల్లకుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శాంతినగర్ నుంచి నందనవనం మీదుగా తిలక్‌నగర్ మెయిన్ రోడ్డు వరకు ఉన్న నాలాలో పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను జేసీబీతో శుక్రవారం తీసివేయించారు. ఈ పనులను స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డిలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవి, బీఆర్ఎస్ నాయకులు మహేష్, మిరియాల శ్రీనివాస్, జి.బాలరాజు, వెంకటరమణరాజు, అర్జున్, మహేష్‌యాదవ్, న్యాయవాది శ్రీహరి, ఆర్‌బీఐ రమేష్ పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టుకు సహకారం అందిస్తాం

నల్లకుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్ట్ పురుషోత్తమరావు కుటుంబం ఆర్థిక ఇబ్బందులో ఉందని, దివ్యాంగులైనా అయనకు మూడు చక్రాల మోపెడ్ (వాహనం) అందిస్తే సేవలందించినట్లవుతుందని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. శుక్రవారం నల్లకుంటలోని బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పురుషోత్తమరావుకు సహకారం అందిస్తామని అన్నారు. పురుషోత్తమరావు కుటుంబానికి సహాయం అందించడానికి 9618247897, 9705833191 ఫోన్‌నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు. పేద బ్రాహ్మణుడైన సీనియర్ జర్నలిస్టుగా ఆయనకు చేయూతనందించే బాధ్యత బ్రాహ్మణ జాతిపై ఉందని ఆయన పేర్కొన్నారు.



పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 7700 కోట్లు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం బీసీశాఖ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశంకు సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్

- కవాడిగూడ, (ఆంధ్రజ్యోతి)


'పాలకుల అక్రమాలు, అవినీతిని ప్రశ్నించి నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించుకోవాలి'

బర్కత్‌పుర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పాలకుల అక్రమాలు, అవినీతిని ప్రశ్నించి నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించుకోవాలని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మహిళలు సంఘటితమై మతతత్వ రాజకీయాలకు గుణపాఠం చెప్పాలని అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు అప్పుల ఊబీలోకి కూరుకుపోతున్నాయని అన్నారు. బెల్ట్ షాపులను మూసివేయడం, మద్యాన్ని నియంత్రించడంలో రెండు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో హక్కుల కార్యకర్త డాక్టర్ వనమాల, చైతన్య మహిళా సంఘం నగర కన్వీనర్ సత్య, కో-కన్వీనర్ శ్రీదేవి, ప్రతినిధులు విజయ, గిరిజ, సావిత్రి పాల్గొన్నారు.

శిక్షార్హత లేని సంస్కృతిని పెంచిపోషిస్తున్న బీజేపీ

చిక్కడపల్లి,మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నేరస్థులకు ధైర్యం కల్పించి, శిక్షార్హత లేని సంస్కృతిని బీజేపీ పెంచి పోషిస్తోందని గాంధీనగర్ డివిజన్‌కు చెందిన సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. ఆలిండియా మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబా, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం కవిత విలేకరులతో మాట్లాడారు. న్యాయవ్యవస్థ తరచుగా సకాలంలో సున్నితమైన తీర్పులను అందించలేకపోతోందని, దీంతో బాధితులు, వారి కుటుంబాలు నిరాశకు గురవుతున్నాయన్నారు. ఈ వ్యవస్థను అంతం చేయడానికి దేశానికి బహుముఖ వ్యూహం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

ఇద్దరు అదృశ్యం



కునాల్

కవాడిగూడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు ఇద్దరు కలిసి మార్కెట్‌కు వెళ్తున్నారు. ఇంతలో నువ్వు మార్కెట్‌కు వెళ్లు.. నేను వస్తా అని చెప్పి వెళ్లిన భర్త అదృశ్యమైన ఘటన శుక్రవారం గాంధీనగర్ పీఎస్ పరిధిలో జరిగింది. గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ బన్సీలాల్‌పేటలోని సీసీనగర్‌లో కునాల్ (24) తన భార్య స్రవంతితో నివాసం ఉంటున్నాడు. కునాల్ మెట్టుగూడలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. వీరికి పిల్లలు లేరు. గత నెల 21న భార్యాభర్తలు ఇద్దరు కలిసి మార్కెట్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో కునాల్ ఇప్పుడే వస్తాను.. నువ్వు మార్కెట్‌కు వెళ్లు అని భార్య స్రవంతికి చెప్పి వెళ్లిపోయాడు. కునాల్‌కు ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వస్తుందని, బోయిగూడలోని తన అత్తగారింటి వద్ద వెతికిన ఆచూకీ దొరకలేదని, 3 నెలల క్రితం చెప్పకుండా బోయిగూడలోని తన ఇంటికి వెళ్లిపోయాడని కునాల్ భార్య స్రవంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కునాల్ బరువు 65 కేజీలు, ఎత్తు 5.5, పసుపురంగు గీతల షర్ట్, బ్లూ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గాంధీనగర్ పోలీసులు తెలిపారు.

అంబర్‌పేటలో విద్యార్థిని..



సానియా అనం

అంబర్‌పేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ విద్యార్థినీ అంబర్‌పేట పీఎస్ పరిధిలో అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట పటేల్‌బాడలో నివాసం ఉండే ఆసియాబేగం కుమార్తె సానియాఅనం(17) రామంతాపూర్‌లోని ఓ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతోంది. గతనెల 16న సానియాఆనం కాలేజీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. కాలేజీకి వెళ్లిన సానియాఅనం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన ఆమె తల్లి ఆసియాబేగం శుక్రవారం అంబర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ అశోక్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ విజయ సంకల్పయాత్ర ప్రారంభం

- పెద్ద ఎత్తున పాల్గొన్న బీజేపీ శ్రేణులు, కళాబృందాల ప్రదర్శన
- అడుగడుగునా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి హారతులతో స్వాగతం పలికిన మహిళలు



విజయ సంకల్ప యాత్రకు హాజరైన బీజేపీ శ్రేణులు

ముషీరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ మరోసారి ప్రధాన మంత్రి కావాలనే లక్ష్యంతో చేపట్టిన బీజేపీ విజయ సంకల్పయాత్ర శుక్రవారం ముషీరాబాద్ చౌరస్తా నుంచి ప్రారంభమైంది. ఈ యాత్రలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్ గౌడ్, సి.కె.శంకర్, కార్పొరేటర్లు సుప్రియా నవీన్‌గౌడ్, రవిచారి, పావని వినయ్‌కుమార్, రచనశ్రీ, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్‌లు యాత్రలో పాల్గొన్నారు. దారి పొడవున కళాకారుల ప్రదర్శన, బ్యాండ్‌మేళాలు, స్వాగత వేదికల వద్ద కిషన్‌రెడ్డికి మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. భవనాలపై నుంచి పూలజల్లు కురిపించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాషాయం తలపాగ ధరించి ఆకర్షనీయంగా నిలిచారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జిందాబాద్ అంటూ... నినాదాలు చేస్తూ ర్యాలీ ముషీరాబాద్ చౌరస్తా నుంచి ప్రాగాటూల్స్ చౌరస్తా మీదుగా ఆరు డివిజన్లలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జమాల్‌పురి నందు, విశ్వం, సదానంద్ ముదిరాజ్, బిజ్జి కనకేష్‌కుమార్, ఆరు డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

పాల్గొన్న గాంధీనగర్ కార్పొరేటర్

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ విజయసంకల్ప యాత్రలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితోపాటు గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ పాల్గొన్నారు. సబర్మతినగర్, అరుంధతినగర్, అన్నానగర్, అశోక్‌నగర్, జవహర్‌నగర్, ఆర్టీసీక్రాస్ రోడ్, స్వామివివేకానందనగర్ వరకు జరిగిన యాత్రలో ఆమెతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

అంబర్‌పేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 2వ తేదీ శనివారం సాయంత్రం అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే విజయ సంకల్ప యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని అంబర్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసోజు నాగభూషణం చారి, బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.యశ్వంత్‌లు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరవుతారని వారు తెలిపారు. కార్యకర్తలు, బీజేపీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్



ఏసీబీ అధికారులకు పట్టుబడిన విద్యుత్ ఉద్యోగి

ఉప్పల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హబ్సిగూడలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. జూనియర్ అకౌంట్స్ అధికారి తోటి ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాచారం ఏడీఏ కార్యాలయంలో ఆర్టిజెన్‌గా పనిచేస్తున్న భరత్ తనకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో హబ్సిగూడ విద్యుత్ కార్యాలయంలో(టీఎస్ఎస్‌పీడీఎస్ఎల్) జూనియర్ అకౌంట్స్ అధికారి విజయసింహారెడ్డిని సంప్రదించాడు. 14 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. రూ.35 వేలు లంచం ఇస్తే కానీ తనకు రావాల్సిన బకాయిలు విడుదల చేయడం కుదరదని విజయసింహారెడ్డి చెప్పాడు. దీంతో హైదరాబాద్-2 యూనిట్ ఏసీబీ అధికారులను భరత్ ఆశ్రయించాడు. భరత్ నుంచి రూ.35వేలు లంచాన్ని విజయసింహారెడ్డి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలించారు.

అవినీతి అధికారులను పట్టిస్తే నజరానా

మహేశ్వరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించిన వారికి కేఎల్లార్ ట్రస్టు ద్వారా రూ.లక్ష నజరానా అందజేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధి తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి అధికారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించదని తెలిపారు.



ముషీరాబాద్ నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహా, శివముదిరాజ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు

మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించిన బీఆర్ఎస్ నేతలు

చిక్కడపల్లి, ముషీరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజ్‌పై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ అధిష్ఠానం ఇచ్చిన పిలుపులో భాగంగా 'చలో మేడిగడ్డ' బ్యారేజ్ కార్యక్రమానికి ముషీరాబాద్ నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ ర్యాలీని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ సీనియర్ నాయకుడు శివముదిరాజ్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, అరుణ్ కుమార్, పార్టీ నాయకులు పూసగోరక్‌నాథ్, శ్రీనివాస్, బల్వంత్‌రాజ్ పాల్గొన్నారు.

ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్ ఆదేశాల మేరకు గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ నేతలు శుక్రవారం మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించారు. డివిజన్ ప్రధానకార్యదర్శి శ్రీకాంత్, మాజీఅధ్యక్షుడు శ్రీనివాస్ గుప్త, నాయకులు వెంకటేష్, దేవయ్య, రాము, భాస్కర్ తదితరులు సందర్శించిన వారిలో ఉన్నారు.

నవభారత్ లయన్స్ క్లబ్‌కు 9 అవార్డులు

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నవభారత్ లయన్స్‌క్లబ్ సభ్యులు 9 అవార్డులను అందుకున్నారు. ఇంటర్నేషనల్ లయన్స్‌క్లబ్ 320ఎ రీజియన్ మీట్ శుక్రవారం నగరంలో జరిగింది. మీట్‌లో హంగర్‌రిలీఫ్, డయాబెటిక్ క్యాంప్‌లు, వైల్డ్ క్యాన్సర్, పర్యావరణ కార్యక్రమాలు, అనాథ, ప్రభుత్వ స్కూల్‌విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంగా 5 క్లబ్ అవార్డులు, 4 వ్యక్తిగత అవార్డులందుకున్నట్లు క్లబ్ ప్రధానకార్యదర్శి డా.హిప్నో పద్మాకమలాకర్ తెలిపారు.

కమిషనరేట్‌కు నూతన బోర్డులు

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయానికి నూతన బోర్డులను ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు ఉన్న చిన్నబోర్డులను తొలగించి పెద్దబోర్డులను ఏర్పాటుచేశారు. కమిషనరేట్ ప్రహరీ బయట ఖాళీస్థలంలో కార్లు పార్కింగ్ చేయకుండా ఏర్పాట్లు చేశారు.

అంకితభావంతో పనిచేసే మహిళా కార్యకర్తలకు తగిన గుర్తింపు

రాంనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో అంకితభావంతో పనిచేసే మహిళా కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించేందుకు కృషి చేస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలుగా నియమితులైన గజ్జెల కవిత శుక్రవారం మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పి.కవిత తదితరులు పాల్గొన్నారు.

3న అనిల్‌కుమార్‌యాదవ్‌కు సన్మానం

రాంనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌కు ఈనెల 3న ఆదివారం సాయంత్రం 6 గంటలకు ముషీరాబాద్‌లోని కషిష్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అభినందన సభ, పౌర సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ పార్టీ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

న్యాయవ్యవస్థలో సమస్యల పరిష్కారానికి వినతి


చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థలో ఎదురవుతున్న సమస్యలను నూతన ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ లా చీఫ్‌సెక్రటరీ తిరుపతిని కలిసి శుక్రవారం లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సిస్వామి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ క్యాడర్‌లో నియమితులైన వారు మూడు సంవత్సరాలకు ఒకసారి వివిధ ప్రాంతాలకు బదిలీ కావాలని, కానీ, పదిహేను సంవత్సరాలుగా హైదరాబాద్‌లో అనేకమంది పనిచేస్తున్నారని, దీనివల్ల తెలంగాణ వారికి అన్యాయం జరుగుతుందన్నారు. నూతన ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా జూనియర్ న్యాయవాదులకు గౌరవవేతనం చెల్లించాలని కోరారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అన్నారు.



మోదీ ఫోటోతో ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కావ్యకిషన్‌రెడ్డి

ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు తెలపాలి

బర్కత్‌పుర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి అన్ని వర్గాల ప్రజలు ఎంపీ ఎన్నికల్లో పూర్తిమద్దతు తెలపాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యకిషన్‌రెడ్డి కోరారు. శుక్రవారం మోదీ ఫోటోతో ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించడంతోపాటు అపార్ట్‌మెంట్ ఓటర్లతో సమావేశం నిర్వహించారు. దేశాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. అపార్ట్‌మెంట్‌వాసులు ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఏ.సూర్యప్రకాష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చీమ శ్రీనివాస్

మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలి

బర్కత్‌పుర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలని మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ వి.నతానియాల్, విశ్రాంత రైల్వేఅధికారి భరత్‌భూషణ్ డిమాండ్ చేశారు. మాదిగ, మాదిగ ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రెండు ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరస్వామి, రాజేందర్, ఆనంద్, రాంబాబు, నర్సయ్య పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకునే ప్రయత్నాలను విరమించుకోవాలి

బర్కత్‌పుర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్ధాలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఇళ్ల స్థలాల పంపిణీని కొంతమంది అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని విరమించుకోవాలని టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ సభ్యులు అబ్దుల్ సాధిక్, తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమురెల్లిలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సహకారశాఖ డైరెక్టర్ శ్రీనివాసరావును కలిసి ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియకు సహకరించాలని వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అనీఫ్, ముక్తార్ ఆహ్మద్, అజయ్, హుస్సేన్, శంకర్, ఝాన్సీరాణి, స్వర్ణకుమారి, రామనాథశెట్టి, కమలకర్‌రావు, శ్రీదేవి, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఇన్‌స్పెక్టర్ సూచనలు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు ఉద్బోధించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్న ఆయా కాలేజీల వద్దకు శుక్రవారం ఉదయం చేరుకున్న ఆయన విద్యార్థులను కలిసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. ఇంటర్ ఎగ్జామ్‌సెంటర్లను చెక్ చేస్తూ విద్యార్థులకు ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

3న మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం

బర్కత్‌పుర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీ.వీ.నరసింహారావుకు భారతరత్న పురస్కారం వచ్చిన సందర్భంగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఈ నెల 3న సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ సంఘాల జేఏసీ ప్రతినిధి జమలాపురం శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రజనీరావు, రాజేశ్వరరావులు తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 3న రవీంద్రభారతిలో ఉదయం 9 గంటలకు ఈ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ గౌరవసలహాదారులు వేణుగోపాల్, పీవీ కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వారు తెలిపారు.



సురేష్‌ను సన్మానిస్తున్న కార్యదర్శి పద్మజ

ఉద్యోగాలు సాధించేవారు గ్రంథాలయ బ్రాండ్ అంబాసిడర్లు

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): లైబ్రరీలో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేవారు గ్రంథాలయానికి బ్రాండ్ అంబాసిడర్లని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ అన్నారు. తెలంగాణ గురుకుల విద్యాలయ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించిన సురేష్‌ను శుక్రవారం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలోని తన ఛాంబర్‌లో కార్యదర్శి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న సురేష్ ఈ రోజు ప్రభుత్వ ఉద్యోగం సాధించడం గ్రంథాలయానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు అవినాష్, సుకేష్, వెంకటేష్, శ్రీకాంత్, వేంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

'తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి'

అంబర్‌పేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవికాలం దృష్టిలో ఉంచుకుని అంబర్‌పేట డివిజన్‌లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ జలమండలి అధికారులను కోరారు. శుక్రవారం ఆయన జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవిలో మెరుగైన నీటి సరఫరా అందించాలని కోరారు. డివిజన్‌లో అవసరమైన తాగునీటి పైప్‌లైన్లను చేపట్టాలన్నారు.

'మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

చిక్కడపల్లి, రాంనగర్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని పలు మున్నూరుకాపు సంఘాల నేతలు తీర్మానించారు. శుక్రవారం చిక్కడపల్లిలోని ఓ హోటల్‌లో సమావేశమైన తెలంగాణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు దేవయ్య పటేల్, తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దశరథం పటేల్, మున్నూరుకాపు డెవలప్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు రవి, మున్నూరుకాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్‌పటేల్, మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వనమల ప్రవీణ్‌లు మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నట్లుగా మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సంఘాల నేతలు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి

నార్సింగ్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి కోకాపేట గుట్టపై మూవీ టవర్స్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా గన్నేవరం గ్రామానికి చెందిన మునిగంటి కరుణాకర్ (45) డీసీఎం డ్రైవర్. పని మీద నగరానికి వచ్చిన కరుణాకర్ కోకాపేట వద్ద రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు నార్సింగ్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ విషయాన్ని భార్య సుశీలకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కవాడిగూడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 104 ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 104 ఉద్యోగుల సర్వీసులను క్రమబద్దీకరించి, ఏజేన్సీ ద్వారా కాకుండా ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులు పెద్దఎత్తున హాజరయ్యారు. ధర్నాలో ముఖ్య అతిథిగా భాస్కర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమ్లఓ యూనియన్ గౌరవ అధ్యక్షుడు భూపాల్, ఎస్.విద్యాసాగర్, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎండీ.ఫసియుద్దీన్, యాదానాయక్, రాష్ట్ర నాయకులు విద్యాసాగర్, విజయవర్ధన్‌రాజు, నవీన్, సుబాష్‌చంద్ర, శ్రీనివాస్, రాజేష్, రాజుతో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

9న ఝాన్సీలక్ష్మీబాయి నారీశక్తి పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కళాదర్బార్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9న త్యాగరాయగానసభలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధరంగాల ప్రముఖ మహిళామణులకు ఝాన్సీలక్ష్మీబాయి నారీశక్తి పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం చిక్కడపల్లిలో కార్యక్రమ బ్రోచర్‌ను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగారావు తదితరులు ఆవిష్కరించారు.

నేడు అంబర్‌పేట నియోజకవర్గంలో విజయ సంకల్పయాత్ర

బర్కత్‌పుర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విజయ సంకల్పయాత్ర నేడు కాచిగూడ డివిజన్ నారాయణగూడ వైఎంసీఏ వద్ద ప్రారంభమవుతుందని స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మధ్యాహ్నం 2 గంటలకు ఈ యాత్ర ప్రారంభమై కుత్బీగూడ, మోతిమార్కెట్, చప్పల్‌బజార్, నింబోలిఅడ్డ, లింగంపల్లి చౌరస్తా, బర్కత్‌పుర చమాన్ మీదుగా ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాకు చేరుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ యాదవ్, సూర్యప్రకాష్‌సింగ్, సుభాష్‌పటేల్, కృష్ణకుమార్, క్షీరసాగర్ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



హోంగార్డు కుటుంబానికి రూ. 30 లక్షల ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్

హైదరాబాద్ సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు కుటుంబానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పర్సనల్ యాక్సిడెంట్ డెత్ కవరేజి కింద రూ.30 లక్షల చెక్కును అందజేశారు. మారుతి అనే హోంగార్డు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించారు. గతేడాది నవంబర్ 7న రాత్రి రావోల్‌కోల్ కమాన్ వద్ద విధులు నిర్వహిస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆస్పత్రికి తరలిస్తుండగానే ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన జీతానికి సంబంధించిన ఖాతా హెచ్‌డీఎఫ్‌సీ డీఎల్ఎఫ్ బ్రాంచిలో ఉండటం.. బ్యాంకు ద్వారా హోంగార్డు సాలరీ అకౌంట్ ఉన్న వారికి పర్సనల్ యాక్సిడెంట్ డెత్ ఇన్సూరెన్స్ నిర్వహిస్తున్నారు. మరణించిన హోంగార్డు కుటుంబానికి ఇన్సూరెన్స్ డబ్బులకు సంబంధించిన చెక్కును బ్యాంకు అధికారులు సిద్ధం చేశారు. శుక్రవారం సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ చేతుల మీదుగా ఆ చెక్కును హోంగార్డు భార్య భాగ్యలక్ష్మికి అందించారు. కార్యక్రమానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కార్ హెడ్‌క్వార్టర్స్ అదనపు డీసీపీ రవిచందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.